# సినీ పరిశ్రమలో పర్సంటేజీ విధానంపై వివాదం



సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజీ విధానంలో సినిమాల్ని ప్రదర్శించాలనే తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయాన్ని నిర్మాతల గిల్డ్ వ్యతిరేకించింది. థియేటర్లకు పర్సంటేజీ ఇవ్వడం కుదరదని నిర్మాతల గిల్డ్ తేల్చి చెప్పింది. గతంలో అద్దె ప్రాతిపదికన సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రదర్శనలు కొనసాగేవి. మల్టీప్లెక్స్‌ల తరహాలోనే హైదరాబాద్‌లోని 23 సింగిల్ స్క్రీన్ థియేటర్లు పర్సంటేజీ విధానంలో సినిమాల్ని ప్రదర్శించాలని ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.మరోవైపు పర్సంటేజీ ఇస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని ఫిల్మ్ ఛాంబర్ చెబుతోంది. ఇతర రాష్ట్రాల్లో పర్సంటేజీ విధానమే అమలవుతోందని వెల్లడించింది. తమ నిర్ణయాన్ని కాదని నిర్మాతల గిల్డ్ ఎలా స్పందిస్తుందని ఫిల్మ్ ఛాంబర్ ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. దీనిపై ఏప్రిల్ 30లోగా తుది నిర్ణయం తీసుకోవాలని కోరింది. పర్సంటేజీ ఇవ్వకుంటే మే 1నుంచి సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూసివేసే యోచనలో ఉన్నట్లు తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ సంఘం వెల్లడించింది.

# ఇప్పుడే మొదలెట్టినట్లుంది!

"దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది" అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీరంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.



## ఈ ఏడాది గొప్ప చిత్రాల్లో 'డెకాయిట్' ఒకటి: నాని




అడివి శేష్ ప్రధాన పాత్రలో షానియల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డెకాయిట్' భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకుంది. తాజాగా దీనిపై నటుడు నాని చిత్రబృందాన్ని అభినందిస్తూ పోస్ట్ పెట్టారు.'డెకాయిట్' మనసును హత్తుకునే నిజమైన బ్లాక్‌బస్టర్ అని.. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మిస్ కావద్దని నాని ప్రేక్షకులను కోరారు. ఈ సినిమాలో అడివి శేష్ నటన అద్భుతమని కొనియాడారు. ఇది అతని కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన అని అన్నారు. నటి మృణాల్ ఠాకూర్ తన పాత్రలో చాలా అందంగా ఒదిగిపోయారన్నారు. ఆమె ఖాతాలో మరో గొప్ప సినిమా చేరిందని ప్రశంసించారు. రచన, స్క్రీన్‌ప్లే విభాగం పనితీరును మెచ్చుకున్నారు. ఈ ఏడాదిలోని గొప్ప చిత్రాల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోతుందని.. ఇలాంటి సినిమాను నిర్మించినందుకు సుప్రియను ప్రత్యేకంగా అభినందించారు. నాని పోస్ట్‌కు అడివి శేష్ రిప్లై ఇచ్చారు. ఈ రివ్యూ చూసిన తర్వాత తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. 'డెకాయిట్' టీమ్ మరింత ఉత్సాహంగా ఉందన్నారు.

## 'శక్తి శాలిని'లో ద్విపాత్రాభినయం?

'సైయారా' సినిమాతో మంచి క్రేజ్ సంపాదించుకుంది బాలీవుడ్ యువ కథానాయిక అనీత్ పడ్డా. తొలి అడుగులోనే కుర్రకారుని ఆకట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు 'శక్తి శాలిని'గా తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది. అనీత్ ప్రధాన పాత్రలో ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది. తాజాగా ఈ హారర్ కామెడీ చిత్రంలో అనీత్ ద్విపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది. ఒకటేమో.. తన కుటుంబాన్ని రక్షించే మహిళగా.. మరొకటేమో.. ప్రతీకారంతో రగిలిపోయే ఆత్మగా.. ఇలా రెండు విభిన్న శక్తులు కలిగిన పాత్రల్లో అనీత్ కనిపించనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. బెంగాలీ జానపద కథలు, పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విశాల్ జెత్వా, వినీత్ కుమార్ సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.





## మధుబాలగా. . 'ధురంధర్' నాయిక?

'ధురంధర్'తో తొలి అడుగులోనే కెరీర్‌లో గుర్తుండిపోయే బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది బాలీవుడ్ యువకథానాయిక సారా అర్జున్. 'యుఫోరియా'తో తెలుగు ప్రేక్షకులకూ చేరువైన ఈ తారకు ప్రస్తుతం అవకాశాలు వరుస కడుతున్నాయి. ఇందులో భాగంగానే సారా.. ప్రముఖ నటి మధుబాల బయోపిక్‌లో నటించే అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాణంలో మధుబాల జీవిత చరిత్ర తెరపైకి రాబోతున్న విషయం తెలిసిందే. దీన్ని జస్మీత్ కె.రీన్ తెరకెక్కిస్తున్నారు.

ఈ సినిమా కోసం పలువురు అగ్రనాయికల పేర్లు పరిశీలనలో ఉన్నప్పటికీ.. ఇప్పుడా అవకాశాన్ని సారా చేజిక్కించుకున్నట్లు తెలుస్తోంది. "ఈ ప్రాజెక్టు హిందీ స్వర్ణయుగం నేపథ్యంలో సాగే ఒక ప్రతిష్ఠాత్మక చిత్రానుభవంగా నిలిచిపోతుంది. ఈ ఉత్కంఠభరితమైన డ్రామాకు సారా సరిగ్గా సరిపోతుందని చిత్రబృందం భావిస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి రానుంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి 'ధురంధర్'తో రఫ్ఫాడించిన సారా.. మధుబాలగా ఎలా ఒదిగిపోతుందో చూడాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



## ప్రేమ విషయంలో అదే నా ఆలోచన!

'ఉప్పెన'తో అందర్నీ అలరించిన కృతిశెట్టి తాజాగా మరో ప్రేమకథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. అదే... 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (ఎల్.ఐ.కె). ప్రముఖ కథానాయిక నయనతార నిర్మించగా, ఆమె భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించారు. ఈ చిత్రం ఈ రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా కథానాయిక కృతిశెట్టి గురువారం విలేకర్లతో ముచ్చటించింది.

**ఈ సినిమాని నయనతార నిర్మించారు కదా. ఆమె సలహాలేమైనా ఇచ్చారా?**

ఈ ప్రయాణంలో ఆమెతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. ఓ సందర్భంలో నా వ్యక్తిగత జీవితానికి సంబంధించి నాకున్న కొన్ని సందేహాల్ని ఆమెతో పంచుకోగా, తీరిగ్గా విని మార్గదర్శనం చేశారు. తెరపైన ఆమెని చూస్తే ఓ లేడీ బాస్‌ని గుర్తు చేస్తారు కానీ, బయట మాత్రం చాలా సన్నిహితంగా ఉంటారు. దర్శకుడు విఘ్నేశ్ శివన్ అయినా, నయనతార అయినా సెట్‌లో ఉన్న ప్రతి ఒక్కరినీ జాగ్రత్తగా చూసుకుంటారు. తిన్నారో లేదో స్వయంగా అడిగి తెలుసుకుంటుంటారు.

**'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'... భవిష్యత్ ప్రేమకు అద్దం పట్టే కథతో రూపొందిన చిత్రం కదా. గతం, ప్రస్తుతం, భవిష్యత్తు... మీకు ఏ తరహా ప్రేమ కథలంటే ఇష్టం?**

నేనైతే గతంలోని ప్రేమల్నే నమ్ముతాను. ప్రేమలేఖలు రాయడంలో ఓ కిక్ ఉంటుంది. ఆ తరం ప్రేమికుల్లో కనిపించే అమాయకత్వంలో తెలియని ఓ ఆనందం దాగి ఉంటుంది. అందుకే 'సీతారామం', '96' లాంటి సినిమాల్లో చూపించిన ప్రేమంటేనే నాకు ఇష్టం.

**ఈ కథలో ప్రధానంగా మిమ్మల్ని ఆకట్టుకున్న విషయాలేమిటి?**

ఇది 2040 నేపథ్యంలో సాగే కథే అయినా, అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. అదే ఈ సినిమా ప్రత్యేకత. ఇప్పుడు మన చేతిలో డబ్బు లేకపోయినా, ఇతర ముఖ్యమైన వస్తువు ఏది లేకపోయినా ఫర్వాలేదు కానీ, ఫోన్ లేకపోతే మాత్రం ముందుకు అడుగు వేయడం కష్టమవుతోంది. అలా ఫోన్‌నే తన ప్రపంచం అనుకున్న ఓ అమ్మాయిగా నేను కనిపిస్తా. ఇందులో ప్రేమకథ కూడా బాగుంటుంది. హాస్యం, ప్రేమ తదితర అంశాల్ని మేళవించిన ఓ మంచి వాణిజ్య ప్రధానమైన సినిమా ఇది. 'ఉప్పెన' తర్వాత నేను పూర్తిస్థాయి ప్రేమకథని చేయలేదు. విఘ్నేశ్ ఈ కథ, పాత్ర గురించి చెప్పగానే 'ఇది కదా నేను చేయాల్సిన సినిమా' అనిపించింది. లైక్స్, షేర్స్ కోసం ఎంత కష్టపడాలి తెలుసా? అనే సంభాషణ ట్రైలర్‌లో వినిపిస్తుంది. ఆ సన్నివేశంతోనే నేను కనెక్ట్ అయిపోయా.

**మీకు సవాల్‌గా అనిపించిన సన్నివేశాలేమైనా ఉన్నాయా?**

దర్శకుడు విఘ్నేశ్ శివన్... నాకు ఇప్పటివరకూ కనిపించిన కృతి కాకుండా, కొత్త కృతి కావాలి అన్నారు. సినిమాలో నా పాత్రకు ఫోనే ప్రపంచం కాబట్టి బయట ఎవ్వరి మొహాన్నీ చూడకుండానే మాట్లాడుతుంటుంది. హావభావాలేవీ ప్రదర్శించకుండా ఓ రోబోలాగా కనిపిస్తుంటుంది. వ్యక్తిగతంగా నేను అందుకు భిన్నంగా ఉంటాను. ఇలాంటి విషయాలన్నిటినీ పరిగణనలోకి తీసుకొని నటించాల్సి వచ్చింది.

**ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో మీరూ ప్రేమలో విఫలమైనట్టు చెప్పారు. ఏమిటా కథ?**

అదొక గేమ్‌లో భాగంగా చెప్పిన మాటే (నవ్వుతూ). నా జీవితంలో ఏం జరిగినా మా అమ్మకు కచ్చితంగా తెలుస్తుంది. ప్రస్తుతానికి నా వృత్తినే ప్రేమిస్తున్నా. ఇంకో ఐదారేళ్లు మంచి సినిమాలు చేసి, నటిగా మంచి గుర్తింపుని తెచ్చుకుని ఆ తర్వాత ప్రేమ గురించి ఆలోచిస్తా.